ఒకటి ఈజ్ యీక్వల్ టు పది.

ఇది హైదరాబాదులో గడిపిన మొదటి రోజున నేను తెలుసుకొన్న కటిక నిజం.

నిజానికి ఈ కథపేరు 'ఒకటి ఈజ్ యీక్వల్ టు పది' అంటే నిజానికి దగ్గరగా వుంటుంది.

అయితే ఇది కథ కాదు, మరి. వాస్తవమైన సంఘటన.

జీవితం అంటే ఏమిటి? అంటే గొలుసుకట్టు లాంటి సంఘటనల, అనుభవాల పరంపర.

ఇంతకీ నేను హైదరాబాదు రావడమే చిత్రంగా జరిగింది.

మరొక విధంగా చెప్పాలంటే అసమర్థుడి జీవయాత్ర కది నాంది.

విజయవాడలో ఉద్యోగం చేస్తున్నప్పుడు. నెలకు ఇరవై రూపాయలు జీతం.

ఈ కాలంలో హాస్యాస్పదంగా వుంటుందేమో కాని— ఆకాలంలో ఒక కుటుంబం నిర్విచారంగా బ్రతకడానికి చాలినంత జీతమది.

ఒకవైపు ఆఫీసు బ్రాంచి మానేజరు పదవి. జాబ్ వర్కు చేయాలి. 72 మందికి టైప్‌రైటింగ్‌లో శిక్షణ గరపాలి. స్టేషనరీ విక్రయించాలి. అంతే.

పొద్దుటే మరి వాను ఉదయం 7 గంటలకు దుకాణం తెరవాలి. దుకాణం మూసివేయడానికి మాత్రం ఒక సమయం అంటూ లేదు.

చేతిలో వున్న జాబ్ వర్కు అంతా ఎప్పుడు పూర్తిచేస్తే అప్పుడు దుకాణం కట్టేసి ఇంటికి పోవచ్చు.

తతిమ్మా విధాల యజమానులకు సంపాదించి పెట్టేది అటు వుంచితే కేవలం జాబ్ వర్కు ద్వారా నేను సంపాదించేది, యజమానులకు ముట్టజెప్పేది రోజుకు పదిహేను రూపాయలకు తగ్గదు. ఏనాడూ తగ్గలేదు, నా అనుభవంలో.


ఇంతా చేస్తే నెలకు నాకు లభించేది ఇరవై. అయినా నేను అసంతృప్తి ఎరగను.

ఆ కాలం అలాంటిది. నా యోగ్యతలు అంతకుమించిన సంపాదనకు నోచుకోలేదు.

జీవితం అలా సాఫీగా సాగిపోతే ఇంక చెప్పుకొనేది ఏముంటుంది?

సంతృప్తి నిండిన నా మనసులో రాయి విసిరి అసంతృప్తితో కల్లోలం చెలరేగేటట్లు చేశాడొక ఎలిస్!

మా పక్క వాటాలో వున్న పెద్దమనిషి కొడుకతను. మద్రాసులో ఉద్యోగం వెలగబెడుతున్నాడు. (అలాగే అనేవారు కిట్టనివారు ఆ రోజుల్లో)




సెలవులకు వచ్చాడు. నాకు ఆదివారం సెలవు. ఇంట్లో వున్నాను. నాతో కబుర్లలో పడ్డాడా రంగనాథమనే ఆ ఎలిస్.

'టైప్ రైటింగ్‌లో మీ స్పీడెంత?' అని అడిగాడతను. రంగనాథం మద్రాసులో ఒక పెద్ద కంపెనీలో స్టెనోటైపిస్టుగా పనిచేస్తున్నాడు.

నేనూ స్టెనోటైపిస్టునే.

'ఎనభై అయిదు' అన్నాను.

'అబ్బో!' అని ఆశ్చర్యపడ్డాడు రంగనాథం. ఆ మాటకు అది చాలా ఎక్కువే.

'మరి షార్ట్‌హాండ్‌లో?'

'కొంచెం తక్కువ. 120 వుంది' అన్నాను.

'జీతమెంత?'

'ఇరవై.'

'ఛీ! బోడి ఇరవై! ఎలా ఒప్పుకొన్నారండీ, బాబూ?! అదే మద్రాసులో అయితేనా—సులభంగా 150 పైగా వస్తుంది' అన్నాడు రంగనాథం.

(కొయ్యరా, బాబూ! ఈ ముష్టి, బోడి ఇరవై రూపాయల జీతం వచ్చే ఉద్యోగం సంపాదించడానికి అయిదున్నర సంవత్సరాలు నానాగడ్డి కరిచాను. నీకేం తెలుసు? ఎన్నయినా చెప్పవచ్చు. క్రియ దగ్గరికి వచ్చేసరికి శూన్యం అను కొన్నాను.)

నవ్వి వూరుకొన్నాను.

'ఏం నవ్వుతున్నారు?' అన్నాడు రంగనాథం.

'ఇచ్చేవాడు వుండాలి కదా!' అన్నాను.

'మీరు ఊ! అంటే మద్రాసు తిరిగి వెళ్ళిన మరునాడు మీకు ఆర్డర్ పంపేస్తాను' అన్నాడు రంగనాథం.

జరిగినప్పుడు కదా ఆలోచించేది! అనుకొని, 'అలాగే కానివ్వండి. పిలిస్తే మోకాలు అడ్డుతానా!!' అన్నాను.

అప్పుడు నేను నమ్మే స్థితిలో లేను, నమ్మలేదు కూడా.

కాని రంగనాథం అన్నంత పనీ చేశాడు. అతడు మద్రాసు వెళ్ళిన మూడవ నాడు అతని దగ్గర నుంచి వచ్చిన సారాంశం — ప్రస్తుతానికి వందరూపాయల జీతం వచ్చే ఉద్యోగం ఖాళీగా వుంది. చేరిపోతే నెమ్మదిగా మరో ఉద్యోగానికి ప్రయత్నం చెయ్యవచ్చు. మద్రాసులో స్టెనో టైపిస్టులకు గిరాకీ ఎప్పుడూ ఎక్కువే.

నాకింకా నమ్మకం కుదరలేదు. గతంలో గడించిన అనుభవాల వేదు నరనరాన జీర్ణించి వుంది.

'నా దగ్గర డబ్బులేదు. ఆర్డరుతో బాటు ఒక నెల జీతం అడ్వాన్సుగా పంపిస్తే రెక్కలు కట్టుకుని వాలతాను' అని వ్రాశాను.

మూడవరోజుకు తన్నుకొంటూ వచ్చింది మనియార్డరు వంద రూపాయలకు.

ఆర్డరు సరేసరి. అది కూడా కాస్త పేరున్న కంపెనీయే మరి.

వెంటనే మా కంపెనీ యజమాని దగ్గరికి వెళ్ళాను. మద్రాసు ఉద్యోగం సంగతి చెప్పాను. నన్ను విడుదల చెయ్యమని కోరాను.

మనసులో ఏమూలో రవంత ఆశ మినుకు మినుకు మంటూ వుంది మద్రాసూ వద్దు, పాడూ వద్దు. ఇక్కడ వుండిపో, నాయనా. మరో అయిదు (అయిదంటే అయిదే!) ఇస్తాను – అంటాడని.

ఊ హు! అయిదణాలు కూడా ఇస్తాననలేదు ఆ మహానుభావుడు.

అయిదువందల విలువచేసే కన్నీరు కార్చాడు. నా కివ్వవలసిన డబ్బులు చేతబెట్టి వెంటనే విడుదల చేశాడు.

సెలవు తీసుకొని వచ్చేస్తూ వుండగా ఉచితంగా ఒక సలహా ఇచ్చాడాయన.

'చూడు, బాబూ. నువ్వు కుర్రవాడివి. అనుభవం లేనివాడివి. లోకం పోకడ తెలియని వాడివి.

'మరో పదిరూపాయలు ఎక్కువ ముట్టచెప్తే ఎవడో వుద్ధరిస్తాడని నమ్మి వెళ్ళిపోతున్నావు. నా మంచితనం తెలుసుకోలేక పోతున్నావు.'

నాలాంటి యజమాని నీకు మళ్ళీ ఈ జన్మలో దొరకడు.

'మనిషిని నమ్ముకో. బాగుపడతావు.'

పాపిష్టి డబ్బుని కాదు.



# నష్టానికి లెక్కదండగ!

తూలికా భూషణ్

'నాలుగుకాలాల పాటు నా దగ్గర పడి వుంటావని నమ్మి ఉద్యోగం ఇచ్చినందుకు నాకు తగ్గ శాస్తిచేశావు.

'ఈ జన్మకీ అనుభవం చాలు' అంటూ — మొదట్లోనే చెప్పాను కదా — కడివెడు కన్నీరు కార్చారాయన.

ఇలా విజయవాడ ఉద్యోగానికి తిలోదకాలిచ్చి, మద్రాసు విజయం చేస్తున్నానంటూ మా అమ్మకి తెలియపరిచాను.

అప్పట్లో జపాను వాళ్ళు మద్రాసు మీద బాంబులు వేస్తారనే భయం అధికంగా వుండేది.

పైగా మా అమ్మకి నేనొక్కణ్ణే సంతానం. ఉద్యోగం మాట దేవుడెరుగు. బతికివుంటే బలుసాకైనా తిని బతక వచ్చునని ససేమిరా మద్రాసు వెళ్ళరాదని శాసించింది మా అమ్మ.

చేసేదేముంది? మద్రాసు వాళ్ళ డబ్బు వాళ్ళకి తిరిగి పంపి, క్షమార్పణ కోరుకొంటూ వుత్తరం వ్రాసి, స్వస్థలం చేరుకొన్నాను. నేను చెల్లని నాణెం లాంటి వాణ్ణని మా' ఊరివాళ్ళకి మరొక పర్యాయం ఋజువు అయింది.

మళ్ళీ ఉద్యోగం కోసం వేట ప్రారంభించాను.

అదృష్టవశాత్తూ విమాన బలంలో పైలట్ ఆఫీసరుగా ఎన్నికయ్యాను. యుద్ధకాలం కవక ఆ అవకాశం లభించింది.

మళ్ళీ మా అమ్మ వల్లకాదంది.

అదృష్టం కలిసి వచ్చింది — అదే సమయంలో సైన్యంలో హవల్దార్ క్లర్కుగా సెలక్టు అయ్యాను. సివిలియన్ వుద్యోగం. మా అమ్మ ఆమోదించింది.

అయితే ఉద్యోగం జాల్నాలో.

అలనాడు జాల్నా హైదరా బాదు సంస్థానంలో భాగంగా వుండేది.

సైనిక స్థావరంగా మాత్రమేకాదు, మరొక కారణం చేత కూడా పేరు పొందిన పట్టణం జాల్నా.

అక్కడ ఒక పిచ్చి ఆసుపత్రి వుండేది! వుంది కూడా!

జాల్నా చేరి, జాయినింగు రిపోర్టు ఇస్తే ప్రయాణపు ఖర్చులు ఇస్తారు ప్రభుత్వం వారు.

అక్కడే వచ్చిపడిందొక చిక్కు

నా జాతకం పరిశీలించిన పండిత మిత్రుడు చెప్పినట్లుగా నాది ధనజాతకం కాదు, ఋణ జాతకం.

అందునా మైనస్‌తో ప్రారంభమైంది బతుకు. కనీసం నాకు తెలిసిన బతుకు. నాది అని చెప్పకొనగలిగిన బతుకు.

ప్రయాణానికి సిద్ధంగా వున్నాను.

కాని—

అదే నా జీవితాన్ని మార్చి వేసింది.


అయిదు రూపాయలు తక్కువ.

మా మామగారిని అడిగాను.

ఆయన — సిగ్గుచేటు — కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన ఆ పెద్దమనిషి, నా మీద ప్రేమ లావు అని ప్రపంచానికి ప్రతిరోజూ చెప్పే ఆ పెద్ద మనిషి — ఇవ్వనన్నాడు.

అంతటితో సరిపెట్టలేదు. మరి అయిదు రూపాయలంటే మాటలా? కాసు పన్నెండున్నర రూపాయలకు విక్రయిస్తున్న పుణ్య కాలమది.

'ఎర్రగా బుర్రగా ఉన్నాడు, తెలివైనవాడు—అని నమ్మి అమ్మాయి గొంతు కోశాను. ఈ అల్లుడుగారు ఇంతవరకు చేసిన నిర్వాకం చాలు. ఇప్పుడు అయిదు రూపాయలు ఇస్తే అది కూడా గంగపాలు అవుతుంది. అదో దండగా?' అంటూ ఈసడించి పారవేశాడు.




ప్రేమకు అయిదు రూపాయల విలువ కూడా లేకుండా పోయింది. నిజానికి నాకిలాంటి అవమానాలు అలవాటే. ఎందుకంటే — సర్వే గుణాః కాంచన మాశ్రయంతి — ఆ డబ్బు నాకు లేదు.

సరే, ఏదో ఒకటి అవుతుంది — అని దేవుడిమీద నమ్మకముంచి రైలు ఎక్కాను. సికిందరాబాదు తెల్లవారేసరికి చేరాను. లెక్కపెట్టుకొంటే నా దగ్గర సరిగా మూడు రూపాయలు ఉన్నాయి.

సాయంత్రం కాని జాల్నాకు బండి లేదు. సాయంకాలం వరకు గడవాలి. ప్రయాణం గడవాలి. జాల్నాలో ఆఫీసు చేరుకొనేవరకు గడవాలి.

నా దగ్గర డబ్బు చాలదు.

మరి, ఎలా?

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలంటారు.

రోజంతా — అంటే పగలంతా మనదేకదా? నిదానంగా కాల కృత్యాలు ముగించి, ఇంత తేనీరు కడుపులో పట్టించి, సిగరెట్టు ముట్టించి, పెట్టె బెడ్డింగుల మీద అధివసించి ఆలోచనలోపడ్డాను.

గుర్తు వచ్చింది— మామయ్యగారు హైదరాబాదులో ఒక దినపత్రిక సంపాదకుడుగా ఉన్నారు. ఆయన్నడిగితే అయిదు రూపాయలిచ్చి జాల్నా పంపించకపోరు. లేకపోతే ఊరుకాని ఊరు, పట్టణం, మహానగరం అయిన భాగ్యనగరంలో నాలాంటి నిర్భాగ్యుణ్ణి చిరకాలం భరించడం ఆయన తరమా?

హైదరాబాదు చేరాను. ఇంటి అడ్రసు తెలియదు కనక సరాసరి ఆఫీసుకే వెళ్ళాను. అప్పుడే టాంగాలో ఆఫీసుకి వచ్చిన మామయ్యగారిని కలిశాను. నా గోడు వెళ్లబోసుకొనడానికి ఉపక్రమించ బోయేటంతలో—ఆయన నా అవతారం చూశారు. 'ముందు ఇదే టాంగాలో ఇంటికి వెళ్ళు. స్నానం చెయ్యి, తిండి తిను, శుభ్రమైన బట్టలు కట్టుకొని ఆఫీసుకి రా. మాట్లాడుకొందాము' అన్నారు.

అలాగే చేశాను.

అపరాహ్ణం, లంచి విరామ సమయం.

వేపచెట్టు క్రింద ఆసీనులయ్యారు మామయ్యగారి అధ్యక్షతన, ఆయన సిబ్బంది అందరూ.

ఎవరిమట్టుకు వాళ్లు ఏదో ఒకటి తెచ్చుకొంటారు. మధ్యాహ్నం తినడానికి. ఎవరిమట్టుకువాళ్లు తాము తెచ్చినది అందరికీ పంచిపెడతారు. అలాగ అందరూ అన్ని రకాలూ ప్రతిరోజూ చవిచూస్తారు. పంచుకొనడంలో ఆనందం అనుభవిస్తారు. అది మామయ్యగారు ప్రవేశపెట్టిన పద్ధతి. ఆయన హైదరాబాదులో ఉన్నంత కాలమూ ఆఫీసులో అందరూ త్రికరణశుద్ధిగా పాటించిన సంప్రదాయం.

లంచ్ సమయంలో నా ప్రయాణం వివరాలు చర్చనీయాంశాలయ్యాయి. అక్కడ సమావేశమైనవారు—మామయ్యగారు మినహాగా—ఆనాడు నాకు అపరిచితులు. వారే నా భవితవ్యం నిర్ణయించారు. 'జాల్నా యేమిటి — నాన్సెన్స్!' అన్నారు ఒకరు.

'మీవాడికి మన ఆఫీసులోనే ఉద్యోగం వేయించండి' అన్నారు మరొకరు.

చాలాసేపు తర్జన భర్జనలు జరిగాయి.

చివరికి ఏకగ్రీవంగా (నన్ను ఎవరూ పట్టించుకోలేదు) నిర్ణయించడం జరిగింది.

ఏమని?

నేను జాల్నా వెళ్లరాదు.

హైదరాబాదులోనే ఉండాలి.

మామయ్యగారి ఆఫీసులోనే చేరాలి.

మామయ్యగారే నాకు ఆఫీసులో ఉద్యోగం వేయించాలి.

'ఇంక ఆలస్యం ఎందుకు?' అంటూ లేచారందరూ.

మామయ్యగారు నన్ను ఆఫీసు మానేజరు దగ్గరికి తీసుకొని వెళ్లారు.

'ఏమిటి సంగతి?' అన్నాడాయన.

మామయ్యగారు ప్రారంభించారు.

'వీడు (అంటే నేను) ఈ దేశంలో కెల్లా గొప్ప టైపిస్టు. అతిగొప్ప షార్ట్‌హ్యాండ్ రైటర్...'

మామయ్యగారికి నామీద ఎంతటి ప్రేమ ఉందో జ్ఞానం వచ్చిన నాటి నుంచి నాకు తెలుసు. కాని, అది ముఖ్యం కాదు. మామయ్యగారి సంగతి ఆ మానేజరుకి తెలుసు.


'అది సరే. ఆ కుర్రవాడికి ఉద్యోగం కావాలి. అంతేనా?' అని అడిగాడు మానేజరు.

నన్ను గురించి ఎంతో ఎంతెంతో ఘనంగా చెప్పాలనుకొన్న మామయ్యగారు ఒక విధంగా నీరు కారిపోయారు. విచారించి ప్రయోజనం ఏముంది కనక?

'అవును' అన్నారాయన నీరసంగా.

'సరే' అని నావైపు తిరిగి, 'అరవై రూపాయలిస్తాను. చేరతావా?' అని అడిగాడు మానేజరు.

'చేరతా'నన్నాను.



# కతల్సెప్పకు!

ఈడు సిన్నోడు కదా అని
తోడేలు మేక పిల్లా కత స్సాప్పినాను
'య్యా తెలకపిండి మేక తెల్డి వోడి కెహె...
దాం దుంపతెగా... తోడేలు మా గడుగ్గాయి
సీత కట్టులో సుకంగ
వుడుకు నీలోసుకున్నట్టున్నాయి దాని -పూసులు
అలా డబాయించి మీదడ్తేనే
యివ్వాల వోడి కేన బతుకెహె' అన్నాడు.

ఆవూ చివ్వం కత సాప్తే అన్నాడు కదా...
'జాలి కత లింటాకి సివాలకి
వోపి కేడుత్తాదేటి?
సిటుక్కున సంపేడమే దానిపని
ఆవు సాప్పిన సోల్లు కత లినీసినాదాని
కోతలు కోసేకు రారే ముసిలోడా...' అన్నాడు.

మొసలీ కోతి కత సాప్తే...
'అమ్మ కోతి నంబూ...
ఎయ్యేలా మా గుండెల్ని
య్యా నీటి కొమ్మలికి
తగిలించీ నేక పోనాం
సాల్ సాల్లే' అని మొసలి అన్నమేటి
బుగుంగున కోతి పేనాలు బుదుంగమని పోతాయన్నదు

బొమ్మడూ నల్ల మేకా సాప్తే
'వారెవా... యిదిరా తెల్వి...
నల్లమేకను నల్లకుక్క సేసీసినారు
నానైతే తెల్లకుక్కనే సేసీద్దును
అయ్యా ఆల తెలివికి గుడులు కట్టాలెహె' అన్నాడు.

మంచీ సెడ్డా పెటీ కతలోనూ వుంటాది
ఇయ్యాల య్యా గుంటడు మంచినొడ్డేసి
నిబ్బరంగ సెడ్డ కంటే సుకపోతన్నాడు
మరింక కతల్సెప్పడం య్యేందు కొరే...!

—రంధి సోమరాజు

'అయితే రేపు చేరు. ఈ వేళ సాయంత్రం వద్దు' అన్నాడు మానేజరు.

అంతేనా?

'నీకేమైనా అడ్వాను. కావాలా?' అని అడిగాడా పుణ్యపురుషుడు.

'కావా'లన్నాను.

'ఎంత?'

'నలభై.' ఎంతోకొంత—నోటికి వచ్చిన అంకె చెప్పాను.

మానేజరు కాషియర్‌ని పిలిచి, నావద్ద రసీదు తీసుకొని, నలభై ఇవ్వమన్నాడు. నలభై ముట్టింది.

'సరే. ఇంక వెళ్లిరా' అన్నాడు మానేజరు.

నాకదంతా కలలా ఉంది.

నా భవిష్యనిర్ణయం, ఉద్యోగ ప్రాప్తి, అన్నిటిని మించి ధన లాభం—అంతా నిమిషాలలో జరిగిపోయింది.

ఆ విధంగా—కేవలం అయిదు రూపాయలు లేకపోవడం చేత నేను పత్రికా రచయితను కావడం తటస్థించింది. దానిలో విశేషం లేదు. ఆ సాయంకాలం రవంత వేదాంతం కూడా ఒంట పట్టింది.

ఆ వైనం చెబుతాను.

సాయంకాలం భోజనానంతరం సిగరెట్టుకోసం మామయ్యగారి ఇంటి దగ్గర చౌరస్తాలో ఉన్న ఒక సిగరెట్టు దుకాణానికి వెళ్లాను. గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ పాకెట్ కొన్నాను. పేదవాళ్లకు ధనవంతుల అలవాట్లు ఉంటాయి. సర్వసాధారణంగా, అదే విషాదాంత కావ్య రచనకు ప్రేరేచే మందు గుండు సామగ్రి.

ఆ రోజుల్లో గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ 'స్టేటస్ సింబల్.'

పెట్టె తెరిచాను. ఒక సిగరెట్టు ముట్టించాను తృప్తిగా ఒక దమ్ము పట్టాను. జేబులో చెయ్యి పెట్టాను.

భాఫ్!

డబ్బులు తేవడం మరిచిపోయాను, ఆ రోజు మనసు నిండిన ఆనందంలో మునిగి. పాకెట్టు, అగ్గిపెట్టె తిరిగి ఇస్తూ, 'డబ్బులు తేవడం మరిచిపోయాను. మన్నించండి—ఒక సిగరెట్టు ముట్టించినందుకు, ఇంటికి పోయి డబ్బులు తెచ్చి ఇచ్చి పాకెట్, అగ్గిపెట్టె తీసుకొంటాను' అన్నాను.

ఆ దుకాణదారుడు నవ్వాడు.

'ఫరవాలేదు. పాకెట్ తీసుకుపొండి. నా డబ్బులు నాకు దక్కేవి అయితే దక్కుతాయి.

'పోయేవి అయితే పోనీయండి.

ఒక సిగరెట్టు అయితేనేమి? పది అయితేనేమి? పోయేది ఎలాగూ పోతుంది.

'లెక్క పెట్టడం కూడా ఎందుకు? అదో దండగ!' అంటూ సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె ఇచ్చి పంపాడతను.

అదీ అలనాటి హైదరాబాదులో ఒక చిన్న సిగరెట్టు దుకాణం యజమాని వద్ద హైదరాబాదులో అడుగుపెట్టిననాడు నేను నేర్చుకొన్న పాఠం. అతడిలో దర్శించిన ఔన్నత్యం. నిజంగా ఆనాడది భాగ్యనగరం.

*

